ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 20 సంచిక : 5 జనవరి 2015

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
☎ 08814 - 224747
9247104551



ఈ సంచికలో....

11-11-2014
జిన్నూరు



ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747


## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 11-11-2014, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం అందరం ఈ లోకంలోనికి వచ్చాము. ఇందులో ప్రతీ శరీరం ఏదోరోజున చనిపోతుంది. తిరిగి వెళ్ళటానికే ఇక్కడకు వచ్చాము కాని ఉండటానికి రాలేదు. ఏ రోజున వెళ్ళిపోతామో మనకు తెలియదు కాని వెళ్ళిపోవటం మటుకు ఖాయం. మనకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఇక్కడనుండి వెళ్ళిపోవటం జరుగుతుంది. ఈ శరీరానికి చనిపోయే రోజు వచ్చేటప్పటికి ఉన్నతమైన సుఖం, లోకవిషయాలతో సంబంధం లేని స్వతంత్రమైన సుఖాన్ని ఎవడైతే పొందాడో వాడికి పునర్జన్మలేదు, ఇంక వాడు శవాలను మోయనక్కరలేదు, ఇదే వాడికి చివరిజన్మ. శరీరం వచ్చినందుకు ఈ శరీరంలో ఉండగానే సాధన చేసి తిరిగి శరీరం రాకుండా చేసుకోవాలి. అదే మన జీవిత గమ్యం. ఇప్పుడు మనకు శరీరం వచ్చింది. మరల ఇంకో శరీరం రాకుండా ఉండటానికి దీనిని ఉపయోగించుకోవాలి. ఇతరులకు మీరు ఉపకారం చేయాలన్నా, లోకానికి ఏదైనా ఉపకారం చేయాలన్నా ముందు మీరు ఆత్మజ్ఞానాన్ని పొందాలి. ఆధ్యాత్మికజీవితంలో నియమాలు చాలా ఉన్నాయి. అందులో ఆహారనియమం చాలా ముఖ్యమైనది. ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండకపోతే మనస్సును కంట్రోల్ చేసుకోవటం చాలా కష్టం. ఫుడ్ కంట్రోల్ మీద మైండ్ కంట్రోల్ ఆధారపడి ఉంది. ఆహారనియమంలో నుండి మనోనిగ్రహం వస్తుంది. మనోనిగ్రహంలోనుండి శాంతి కలుగుతుంది, శాంతిలోనుండి సుఖం వస్తుంది.

ఏదో కారణం వలన మనకు అందరికీ భయం వేస్తుంది. భయం లేని స్థితి ఒక్క బ్రహ్మంలోనే ఉంది. అభయస్థితి బ్రహ్మంలోనే ఉంది కాబట్టి బ్రహ్మానుభవం పొందేవరకు మనలను భయం విడిచిపెట్టదు. అంతేకాదు

జన్మించటం, మరణించటం, తిరిగి జన్మించటం అనే ఈ సంసారయాత్ర జరుగుతూనే ఉంటుంది. మనందరకు పూర్వజన్మలు ఉన్నాయి, లేవని అనుకోవద్దు. ఒకోమనిషిని ఒకో వాసన పీడిస్తూ ఉంటుంది, అందరినీ ఒకే వాసన పీడించదు. మనం పూర్వజన్మలో చేసిన పనులనుబట్టి ఈ వాసనలు ఏర్పడతాయి. అవి తరువాత జన్మకు వచ్చేస్తాయి. కేవలం మన తెలివితేటలవలన ఈ వాసనలు బయటకు పోవు. ఎవడైతే కష్టపడి సాధన చేస్తున్నాడో వాడికి ఈశ్వరానుగ్రహం కలుగుతుంది. ఎవడికైతే ఈశ్వరానుగ్రహం కలిగిందో వాడు ఈ వాసనలలో నుండి, బలహీనతలలోనుండి విడుదల పొందుతాడు. ఈ వాసనలలో నుండి, బలహీనతలలో నుండి విడుదలపొందితేనేగాని హృదయంలో ఉన్న వస్తువు స్పష్టంగా మనకు గోచరించదు.

నేను అందరి హృదయాలలో ఆత్మగా ఉన్నాను, ఈ సృష్టికి ఆధారంగా ఉన్నది కూడా నేనే. మీకు మంచి వచ్చినా, చెడ్డ వచ్చినా, అగౌరవం వచ్చినా, గౌరవం వచ్చినా, దారిద్ర్యం వచ్చినా, ఐశ్వర్యం వచ్చినా మీ జన్మాంతరంలో ఉన్న సంస్కారములను బట్టి అవన్నీ నా ద్వారా మీకు వస్తున్నాయి. ఏది వచ్చినా నా ద్వారా మీ ప్రారబ్ధాన్ని బట్టి అవన్నీ మీకు వస్తున్నాయి అని పరమాత్మ చెపుతున్నాడు. ఈ సృష్టికి ఆధారంగా ఉన్నది నేనే. ఈ సృష్టికి ఆధారంగా ఉన్నది జడం కాదు, అది చైతన్యమే. ఆ చైతన్యమే నేను అయి ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. మనకు స్థూలబుద్ధి ఉంది. అందుచేత ఆ విషయాలు మనకు అందటం లేదు. సూక్ష్మబుద్ధి ఉంటేగాని సూక్ష్మ విషయాలను మనం గ్రహించలేము. భగవాన్ ఏమని చెప్పారు అంటే ప్రపంచంలో ఎక్కడా ఏ వస్తువులోను సుఖంలేదు, శాంతిలేదు. నీకు ఉన్న వాసనలనుబట్టి వాటిలో సుఖం ఉందని, శాంతి ఉందని నీకు అనిపిస్తూ ఉంటుంది. మీకు ఏది వచ్చినా సుఖం వచ్చినా, శాంతి వచ్చినా లోపల నుండే వస్తాయికాని బయటనుండి ఏమీరావు. ఆరోగ్యం కూడా లోపలనుండే వస్తుంది. అంటే మీకు ఎప్పుడైనా అనారోగ్యం వస్తే మరల ఆరోగ్యం రావటానికి మీ మనస్సు సహకరించాలి. లోపలనుండి మీ మనస్సు సహకరిస్తే పది రోజులలో తగ్గిపోయేది రెండు రోజులలో తగ్గిపోతుంది.

బుద్ధుడు నిర్వాణస్థితిని పొందిన తరువాత 50 రోజులు మనిషి కదలలేకపోయాడు. అప్పుడు భరించలేని ఆనందాన్ని అనుభవించాడు. ఆ చైతన్యంలో, శాంతిలో, ఆనందంలో మనిషి ఉయ్యాల ఊగినట్లు ఊగాడు. ఇప్పుడు ఏమి చెయ్యాలి అనే ప్రశ్న కూడా ఉదయించ లేదు. మాకు కాలక్షేపం అవ్వటంలేదు అని చాలామంది అంటారు. ఇటువంటి మాటలు అనేవారికి జ్ఞానంరాదు. మీరు రాత్రి 8 గంటలు నిద్రపోతారు అనుకోండి. ఆ 8 గంటలు 8 క్షణాల కింద వెళ్ళిపోతుంది. పగలు కూడా అలా వెళ్ళిపోవాలి. అప్పుడు వాడు కాలాన్ని జయించినట్లు అవుతుంది. కాలాన్ని జయించలేనివాడికి జ్ఞానం కూడా రాదు. జ్ఞానికి ఇది

దగ్గర, ఇది దూరం అనేటువంటి బేధం పోతుంది. శరీరం ఉండటానికి, లేకపోవటానికి మధ్యన తేడా వాడికి తెలియదు. మీకు ఏదైనా కలిసివచ్చే మాటలు విన్నారు అనుకోండి సడన్‌గా మీ మనస్సు అంతర్ముఖమవుతుంది. అప్పుడు మీకు శాంతి కలుగుతుంది. అది స్వతంత్రమైనదికాదు. మీకు ఏదైనా కష్టం కలిగించే మాటలు మీ చెవిలో పడ్డాయి అనుకోండి, అప్పుడు మీ మనస్సు బాహ్యముఖమవుతుంది. అప్పుడు మీకు అశాంతి వస్తుంది. అంటే మీ మనస్సు బాహ్యముఖమైనప్పుడు అశాంతి వస్తుంది, మనస్సు అంతర్ముఖమైనప్పుడు శాంతి వస్తుంది. ఆ శబ్దస్పర్శను మీరు దాటాలి. అంటే మీరు అనుకూలమైన వార్తలువిన్నా, ప్రతికూలమైన వార్తలువిన్నా ఆ చెవిలో పడిన మాటలను మనం జయించలేకపోతే మనకు జ్ఞానం కలుగదు, అంటే శబ్దస్పర్శను కూడా మనం జయించాలి.

మీరు ఎవరైనా అందమైన అమ్మాయిల్ని చూసారు అనుకోండి, మీరు చూడవచ్చు కాని దానిని హృదయంలోనికి తీసుకోవద్దు. మీకు ఏదైనా అందమైన వస్తువు కనిపించింది అనుకోండి, దానిని చూడండి కాని ఆ అందాన్ని మాత్రం మీరు హృదయంలోనికి తీసుకోవద్దు. వాడు ధనవంతుడు, వీడు పేదవాడు అంటారు. వారు మంచివారు, వీరు చెడ్డవారు అంటారు. ఆ మాటలు మీరు విన్నాకాని వాటిని హృదయంలోనికి తీసుకోకూడదు. వాటివలన ద్వైతబుద్ధి పెరిగిపోతుంది. ఇదంతా భగవంతుడి సృష్టి అయితే ఈ ప్రపంచంలో చెడ్డ ఎందుకు ఉండాలి అని అడుగుతున్నారు. అసలు చెడ్డ అనేది లేకపోతే మంచి యొక్క విలువ తెలియదు. రావణాసురుడు లేకపోతే రాముడి యొక్క విలువ మనకు తెలియదు. వాళ్ళ పూర్వజన్మ అలవాట్లను బట్టి చెడ్డ, మంచి అనేవి వస్తూ ఉంటాయి. చెడ్డవాడు మంచివాడు అవ్వవచ్చు, మంచివాడు చెడ్డవాడు అవ్వవచ్చు. మంచి అనేది, చెడ్డ అనేది చైతన్యంలో లేవు, ఇవి మనస్సుకు సంబంధించినవి. మనస్సు అనే గడపదాటితే ఏమీలేదు. అందుచేత మీరు మంచివారిని చూసినా, చెడ్డవారిని చూసినా ఇదంతా హృదయంలోనికి తీసుకోవద్దు. ప్రాపంచిక విషయాలు ఏవీ కూడా హృదయంలోనికి తీసుకోవద్దు. మనం శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించాలి కాని ప్రాపంచిక విషయాలను హృదయంలోనికి తీసుకోకూడదు. మంచి పనులు చేసేవారు చాలామంది ఉంటారుకాని వారు ఎక్కువగా పుణ్యం ఆశించి చేస్తారు. అందుచేత వారు తప్పనిసరిగా బంధింపబడతారు. ఎందుచేతనంటే పుణ్యం ఆశించి మంచిపనులు చేయటంవలన పుణ్యం వస్తుంది. ఆ పుణ్యాన్ని సుఖరూపంలో అనుభవించాలి. దానికి మరల శరీరం రావాలి. శరీరం లేకుండా అనుభవించటం కుదరదు. ఆ సుఖాన్ని అనుభవించేటప్పుడు మరల కొత్తవాసనలు పుడతాయి. అందుచేత మీరు మంచిపనులు చేసేటప్పుడు ఒకటి జ్ఞాపకం పెట్టుకోండి. పుణ్యం ఆశించి మంచి పనులు చేయవద్దు. మీ మనస్సు శుద్ధి అవ్వటానికి చేయండి. మీరు సత్సంగాలు జరుపుకొంటున్నారు

అనుకోండి, మీ మనస్సు శుద్ధి అవ్వటానికి, మీ బుద్ధి బాగుపడటానికి జరుపుకోండి. మీరు ఏదైనా ఒక పని చేసినా, ఒక మాట మాట్లాడినా, ఏదైనా ఆలోచించినా వాటివలన మీ మనస్సు శుద్ధి అవ్వాలి అంతేగాని పుణ్యం గొడవ పెట్టుకోవద్దు. కొంతమంది పుణ్యం వస్తుందంటేనే మంచి పనులు చేస్తారు. కొంతమంది గొప్పలకోసం పనులు చేస్తారు. కొంతమంది వారు మంచిపనులు చేయకపోయినా ఎవడో చేసిన మంచిపనిని నేనే చేసాను అంటారు. ఇటువంటి వాటివలన ఒకవేళ సమాజంలో నీకు గుర్తింపు వచ్చినా లోపల కుళ్ళిపోతావు.

శాంతిలేకుండా, సుఖం లేకుండా, నియమబద్ధమైన జీవితం లేకుండా, ఇష్టాఅయిష్టాల నుండి బయటపడకుండా నువ్వు పరమాత్మను పొందలేవు. ఇష్టాలు, అయిష్టాలు మనస్సుకు లోచూపు కలగనివ్వవు. మీకు ఎవరిమీద అయితే ఇష్టంలేదో వారే మీకు మంచి చేయవచ్చు, మీకు ఎవరిమీద అయితే ఇష్టం ఉందో ఒకోసారి వారే మీకు అపకారం చేయవచ్చు. ఇష్టాలు, అయిష్టాలు ఇదంతా పెర్మనెంట్ అనుకొని మీ మనస్సును పాడుచేసుకోవద్దు. ఇష్టాలు, అయిష్టాల వలన మనస్సు పొల్యూట్ అయిపోతుంది. మనోనిగ్రహం రాకపోవటానికి, మనస్సుకు పవిత్రత రాకపోవటానికి ఈ ఇష్టాఅయిష్టాలే కారణం. బుడగలు సముద్రంలోనే పుడతాయి, బుడగలు సముద్రంలోనే ఉంటాయి, చివరకు సముద్రంలోనే కలిసిపోతాయి. అలాగే ఈ జీవకోటి అంతా నాలోనే ఉదయిస్తున్నాయి, నాలోనే నివశిస్తున్నాయి, చివరకు నాలోనే అణిగిపోతున్నాయి అని పరమాత్మ చెప్పాడు. ఇది నగ్న సత్యం. అయితే కృష్ణుడు ఏ చైతన్యస్థాయిలో ఉండి చెబుతున్నాడో ఆ చైతన్యస్థాయి మనకు లేదు కాబట్టి అవన్నీ అసత్యాలు అని మనం అనుకొంటున్నాము. మన అలవాట్లు, మన రాంగ్ తింకింగ్, మన పాడైపోయిన బుద్ధి భగవంతుడు చెప్పిన మాటలయందు మనకు విశ్వాసం కలగనీయవు. మనిషి ఏమి చెయ్యాలి అంటే లీజను మనల్ని ఎంతదూరం అయితే తీసుకొని వెళుతుందో అంతదూరం లీజను కూడా వెళ్ళాలి. ఇది మంచాచెడ్డా, ఇందులో ఏదైనా ప్రమాదం ఉందా? ఈ పని చేస్తే భవిష్యత్‌లో దీని పరిణామం ఎలా ఉంటుంది? ఈ పని చేయటం వలన మనలో వివేకం పెరుగుతుందా, తగ్గిపోతుందా అని మన బుద్ధితో విశ్లేషణ చేసుకోవాలి. ఎదుటివాడి మాటలనుబట్టి, వాడి ప్రవర్తనను బట్టి నువ్వు ఆ మనిషిని అంచనా వేసుకోవాలి. నువ్వు ఎదుటివాడిని మోసం చేయకపోయినా, వాడు నిన్ను మోసం చేయటానికి ప్రయత్నం చేస్తే ఆ వలలో నువ్వు పడకూడదు.

అందరి హృదయాలలో అంతర్యామిగా నేను ఉన్నాను అని పరమాత్మ చెపుతున్నాడు కదా! అయితే నా హృదయంలో కూడా ఉండాలి కదా! ఉంటే మరి నాకు ఎందుకు తెలియటం లేదు అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. పరమాత్మ నీ హృదయంలో కూడా ఉన్నాడు. ఆయన

నీకు తెలియకపోవటానికి నీ అలవాట్లు, నీ మనస్సులో ఉన్న బలహీనతలు కారణం. మబ్బులు ఉంటే సూర్యుడు కనబడడు. మబ్బులు విడిపోతే సూర్యుడు మనకు ప్రత్యక్షమవుతాడు. అలాగే జ్ఞానసూర్యుడు మన హృదయంలో ఉన్నాడు. నీ రాంగ్‌తింకింగ్ వలన, నీ అలవాట్ల వలన, నీ మనస్సులో ఉన్న దోషాల వలన ఆయన నీకు తెలియటంలేదు. నువ్వు వాటిలో నుండి బయటకు వస్తే ఆయన నీకు వ్యక్తమవుతాడు. పరమాత్మ మనకు అబద్ధాలు చెప్పడు. మీ హృదయంలో ఉన్నాడు కాబట్టి ఉన్నాను అని చెపుతున్నాడు. నిజంగా లేడు అనుకోండి నేను మీ హృదయంలో లేను అని చెబుతాడు. ఆయనకు మనతో వ్యాపారం ఏమీ లేదు. ఆయన పూర్ణుడు. ఆయన సముద్రంలాంటివాడు. నదులు వెళ్ళి సముద్రంలో కలిసినా, ఒకవేళ నదులు కలవకపోయినా సముద్రం ఒకేరకంగా ఉంటుంది. జ్ఞాని పరిస్థితి కూడా అంతే. జ్ఞానికి వచ్చేది లేదు, పోయేది లేదు, వాడు సృష్టిని అలా చూస్తూ ఉంటాడు. జ్ఞానికి కాలం ఉండదు ఆయనకు వంద సంవత్సరాలు వంద క్షణాల కింద వెళ్ళిపోతుంది. జ్ఞానికి దూరం, దగ్గర అని ఉండదు. జ్ఞానికి ఇతరులు లేరు.

మన తెలివితేటలతో వ్రాసిన పుస్తకాలు నిలబడవు, అవి కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. భగవద్గీతను పరమాత్మ చెప్పాడు అందుచేత 2600 సంవత్సరాల కిందట చెప్పినప్పటికీ అది నిన్నటిలాగే ఉంది. అది చైతన్యంలోనుండి వచ్చిన ప్రవాహం. చైతన్యమే అక్షరరూపం ధరించింది. అది భగవంతుడి హృదయంలో నుండి వచ్చింది కాబట్టి ఆ అక్షరాలు కూడా భగవంతుడితో సమానమే. లౌకికులు చెప్పే మాటలు నిలబడవు. వాడి మెదడులో ఒకటి ఉంటుంది నోటితో ఇంకోటి చెపుతాడు, చేత్తో వేరొకటి చేస్తాడు. ఇది అలా కాదు. ఇది భగవంతుడి హృదయంలోనుండి వచ్చింది. కోటి సంవత్సరాల తరువాత కూడా ఇది అంతే, అలాగే ఉంటుంది, ఒక వాక్యాన్ని కూడా మనం మార్చటానికి వీలుండదు. ఈమధ్య నాతో ఒకరు ఏమన్నారు అంటే భగవద్గీతలో ఈ అధ్యాయంలో ఇలా చెప్పాడు, అక్కడ ఆ వాక్యం అలా చెప్పాడు అన్నారు. అంటే నీ ఉద్దేశం భగవంతుడు తేడా చెపుతున్నాడనా? నీకు ఉన్న తెలివితేటలు ఆయనకు లేవు అనుకొంటున్నావా? లేకపోతే భగవంతుడు చెప్పిన వాక్యాలకు తోకలు పెడదామని చూస్తున్నావా? వాటికి సవరణలు చేద్దామని చూస్తున్నావా? అని అడిగాను. భగవంతుడు పరిపూర్ణుడు. ఆయన చెప్పినదానిలో నీకు లోపాలు కనిపిస్తూ ఉంటే అవి నీ మనస్సులో ఉన్న లోపాలే గీతలో ఉన్నట్లు నీకు కనిపిస్తున్నాయి కాని భగవద్గీతలో ఏమీ లోపాలు లేవు. మీరు కృష్ణుడి శరీరాన్ని చూసినా, రాముడి శరీరాన్ని చూసినా మీరు చూడవలసింది ఆ శరీరాలను కాదు, ఆ రూపాలను కాదు, అంతర్యామిగా ఉన్న బ్రహ్మాన్ని చూడాలి. అప్పడు అక్కడ ఉన్న వైభవం మీకు తెలుస్తుంది. భగవద్గీత అలా చెప్పాడు ఏమిటండీ అంటే మీలో ఉన్న

బలహీనతల కారణంగా ఆ వాక్యం మీకు అర్థం కావటంలేదు. కృష్ణుడు ఏ చైతన్యస్థాయిలో చెప్పాడో మనకు ఆ చైతన్యస్థాయి ఉంటే అది మనకు అర్థమవుతుంది. కాని మన చైతన్యస్థాయి తక్కువ కాబట్టి అందులో ఏవో లోపాలు ఉన్నట్లు మనకు అనిపిస్తుంది.

పరమాత్మానుభవం ఎవడైతే పొందాడో వాడి ప్రారబ్ధాన్నిబట్టి ఎప్పుడైనా వాడికి సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా అది వాడిని ముట్టుకోదు, అది వాడిని అంటదు. సుఖం, దుఃఖం అనేవి బయట గొడవలు. వాడికి సుఖం వస్తే పొంగిపోడు, దుఃఖం వస్తే కుంగిపోడు, వాడు సమానంగా ఉంటాడు, వాడికి ఏమీ అనిపించదు. సినిమాల్లో వర్షాలు వస్తాయి, ఆ వర్షాలకు తెర తడుస్తుందా? తెర తడవదు. అలాగే లోకంలో వచ్చే కష్టసుఖాలు నీ హృదయంలో ఉన్న చైతన్యాన్ని అంటవు. వాడి మనస్సుకూడా ఆ చైతన్యంతోటి ఏకీభూతమై ఉంటుంది కాబట్టి ఆ సుఖదుఃఖాలకు మనస్సుకి కూడా వేవరింగ్ రాదు. అది అలా జరిగింది, ఇది ఇలా జరిగింది అని ఎవరైనా భగవాన్‌తో అంటే భగవాన్ ఏమంటారు అంటే అది అలా జరగవలసిఉంది, జరిగింది అంతే అంటారు. ప్రపంచంలో గాలివానలు వస్తున్నాయి, భూకంపాలు వస్తున్నాయి. ఎన్ని వచ్చినప్పటికీ అలా రావలసింది ఉంది వచ్చింది అంతే, అది ఈశ్వరనిర్ణయం, అది భగవంతుడికి తెలియకుండా రావటంలేదు అనేవారు. అంతేగాని అది అలా జరిగిందా అని ప్రపంచంలో ఏ సంఘటనకీ ఆయన జీవితంలో ఎప్పుడూ ఆశ్చర్యం వ్యక్తపరచలేదు. ఆయన దగ్గరకు రకరకాల మనుషులు వస్తూ ఉంటారు. ఎటువంటి రకాల మనుషులు వచ్చినప్పటికీ, వారు ఏ స్థాయిలో ఉన్నవాళ్ళు అయినప్పటికీ ఏ మనిషీ, ఏ సంఘటన ఎప్పుడూ ఆయనను ఆకర్షించలేదు. ప్రపంచంలో అనేక ఆకర్షణలు ఉంటాయి. ఏ ఆకర్షణ ఆయన మనస్సును కదిలించలేదు, దేనికీ ఆయన ఆకర్షింపబడలేదు. ఒక అందమైన అమ్మాయిని భగవాన్ దగ్గరకు తీసుకొని వెళతాము అనుకోండి ఆ అందమైన అమ్మాయిని ఆయన చూడడు, ఆ అమ్మాయిని తయారుచేసిన ఈశ్వరుడిని చూస్తాడు, వాడు భగవాన్. అబ్బ ఆ ముక్కు బాగా పెట్టాడు భగవంతుడు. ఈ అమ్మాయిని తయారుచేసిన భగవంతుడు గొప్పవాడా, ఈ అమ్మాయి గొప్పదా అంటే అమ్మాయిని తయారుచేసినవాడే గొప్పవాడు. ఆ అందమైన ముక్కును, కళ్ళను తయారుచేసినవాడు ఎవడు అంటే ఈశ్వరుడు. ఆ అమ్మాయిని చూడకుండా అమ్మాయిని తయారుచేసిన ఈశ్వరుడినే చూస్తూ ఉంటే ఇంక ఎట్రాక్షన్ ఏమీ ఉండదు. కొంతమంది డబ్బు ఉన్నవారిని గౌరవిస్తారు, డబ్బులేనివారిని గౌరవించరు. ధనంలో ఆ తేడా ఎందుకు వస్తోంది అంటే ధర్మవిరుద్ధంగా ప్రవర్తించటంవలన ఇటువంటి తేడాలు వస్తున్నాయి. అది బుద్ధి ఉన్నవాడు గ్రహిస్తాడు. తెల్లవారుఝామున నాలుగున్నరకు నిద్రనుండి లేవలేకపోతున్నాము, కిటికీలో నుండి ఎండ మామీద పడాలి

అని కొంతమంది అంటున్నారు. మీరు తెల్లవారుఝామున నాలుగున్నరకు లేగిసి చూడండి. అది కూడా తపస్సే. దానివలన మీకు కొంతటైము కలిసివస్తుంది. ఇంటిదగ్గర పనులు చేసుకోవచ్చు, లేకపోతే ధ్యానం చేసుకోవచ్చు, జపం చేసుకోవచ్చు. ఉదయం ఏడు గంటలకు లెగుస్తూ ఉంటే చాలా టైము నిద్రలోనే పోతుంది కదా! అందుచేత మీరు తెల్లవారుఝామున నాలుగున్నరకు లేవటం అలవాటు చేసుకోండి. అదికూడా తపస్సులో ఒక భాగం.

వేసవికాలంలో వేడిని, శీతాకాలంలో చలిని భరించటం కష్టమే కాని ఎంతోకొంత భరించటం నేర్చుకోండి అంటున్నారు. కొంతమంది మంచిమాటలు చెప్పినా వినిపించుకోరు. చెన్నుడు బుద్ధుడి రథం తోలాడు. వాడికి ఒక గర్వం ఉంది. వీళ్ళందరు ఇప్పుడు వచ్చారు కాని ఇంటి దగ్గర నుండి రథం ఎక్కించుకొనివెళ్ళి అడవిలో విడిచిపెట్టినవాడిని నేనేకదా అనే గర్వం వాడికి లోపల ఉంది. వాడు బుద్ధుడి దగ్గర ఉండేవాడు, ఆయన చెప్పిన మాటలు వినేవాడు, బయటకు వెళ్ళి చెడుస్నేహాలు చేసేవాడు. బుద్ధుడు ఏమన్నాడు అంటే చెన్నా నా శరీరం ఉండగా నువ్వు బాగుపడవు. నేను చెప్పిన మాటల యొక్క విలువ నీకు తెలియటం లేదు. కానీ వింటున్నావు కాబట్టి ఎప్పుడో ఒకప్పుడు అవి నీకు అనుభవంలోనికి వస్తాయి, వినటం మంచిదే. నేను చనిపోయాక ఆ మాటల విలువ నీకు తెలుస్తుంది, వాటి బరువు నీకు తెలుస్తుంది. అప్పుడు ఆ మాటలను ప్రాక్టీసు చేసి నువ్వు బాగుపడతావు. నేను బతికి ఉండగా నువ్వు బాగుపడటం నాకళ్ళతోటి నేను చూసుకోను దీనికి కారణం ఏమిటి అంటే ఆయన దగ్గర ఉండి ఏవో కొన్ని మాటలు విని తరువాత బయటకు వెళ్ళి చెడు స్నేహాలతో ఉండే వాడు చెన్నుడు, అందుచేత ఆ మాటలు విన్న ప్రభావం అంతా పోయేది.

మనిషికి గౌరవాలు వస్తాయి, అగౌరవాలు వస్తాయి. ఇవన్నీ బాహ్యగొడవలు. ఈ గౌరవాలు, అగౌరవాలు నిజం అనుకొంటేమటుకు గౌరవంగా బతికినవాడికి అగౌరవం వస్తే వాడికి చనిపోవాలి అనిపిస్తుంది. అలా చనిపోయినవారు కూడా ఉన్నారు. ఒకడు బాగా గౌరవంగా బతుకుతున్నాడు అనుకోండి, పరిస్థితులనుబట్టి వాడికి ఏదైనా అగౌరవం వచ్చింది అనుకోండి వాడికి జ్ఞానం విలువ తెలియకపోతే, పరమాత్మతో వాడికి సంబంధం లేకపోతే ఈ గౌరవం, అగౌరవం నిజం అనుకొంటాడు. పరమాత్మ ముందు ఈ మనుషులు ఇచ్చే గౌరవాలు, అగౌరవాలు, సన్మానాలు ఏపాటివి? డబ్బు ఇచ్చి గౌరవింపబడే వాళ్ళు కూడా ఉన్నారు. గౌరవం అనేది ఒక మేడ్‌నెస్. మిల్టన్ ఏమన్నాడు అంటే మీరు సాధన చేస్తే రాగద్వేషాలు అన్నీ పోతాయి కాని కీర్తికాంక్ష మటుకుపోదు. ఈశ్వరానుగ్రహం లేకుండా కీర్తికాంక్ష నుండి బయటకు రాలేము. చాలామంది వారు చేయని మంచి పనులను కూడా మేమే చేసాము అంటారు. దానికి కారణం ఏమిటి అని విశ్లేషణ చేస్తే ఇటువంటి

అబద్ధాలు చెప్పటానికి కీర్తికాంక్షే కారణం. ఇక్కడ భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే ఈ గౌరవాలను, అగౌరవాలను వదిలెయ్యి, వాటిని అతిగా పట్టించుకోవద్దు. ఇది అంతా దుమ్ము అంటున్నాడు. మీరు ఇక్కడ నుండి కాకినాడ వెళుతున్నారు అనుకోండి, మీరు ఎంత జాగ్రత్తగా ప్రయాణం చేసినా మీ బట్టలమీద దుమ్ము పడుతుంది. మీ బట్టలమీద పడిన దుమ్ము ఎటువంటిదో ఈ గౌరవాలు, అగౌరవాలు అటువంటివే. మీ బట్టలమీద దుమ్ము పడింది అనుకోండి, నా బట్టలమీద దుమ్ము పడింది అని మీరు బాధపడతారా, లేదు. ఆ దుమ్మును దులిపేసుకొంటారు. అలాగే ఈ గౌరవాలు, అగౌరవాలను దులిపేసుకోండి. వాటిలో ఏమీ లేదు. గౌరవం వస్తే పొంగిపోవటం, అగౌరవం వస్తే కుంగిపోవటం ఇటువంటి పనులు మీరు చేయవద్దు. అవి బట్టలమీద పడిన దుమ్ము వంటివి. వాటిని దులిపేసుకోండి.

మీరు ఎవరినీ ద్వేషించవద్దు. ఇట్ ఈజ్ ఎ క్రైమ్. దొంగతనం ఎటువంటిదో ఎదుటి వారిని ద్వేషించటం కూడా అటువంటిదే. ఎవడో బాగుపడుతూ ఉంటే మనకు ఎందుకు? వాడు బాగుపడితే మనకు నష్టం ఏమిటి? వాడు బాగుపడితే మనం అడిగితే ఎప్పుడైనా పదిరూపాయలు అప్పు ఇస్తాడు కదా! వాడిని ద్వేషించటంవలన మనకు కలిసివచ్చేది ఏమీ లేదు. ఇతరులు బాగుపడితే ద్వేషించే లక్షణం ఒకవేళ మీకు ఉంటే దానిని వదులుకోండి. అది బుద్ధిలేనితనం. మీకు ఉన్న పాడుబుద్ధివలన ద్వేషం వస్తోంది. మీరు డబ్బు దగ్గర జాగ్రత్తగా ఉంటే కలిసివస్తుంది కాని ఇతరులను ద్వేషించటం వలన ఏమీ కలిసిరాదు. మీకు కలిసిరాని పనులు చేయకండి.

**ప్రశాంత మనసం హ్యేనం యోగినం సుఖముత్తమమ్**

**ఉపైతి శాంతరజసం బ్రహ్మభూతమకల్మషమ్**

ప్రశాంత మనసం అంటే శాంతముగా ఉన్న మనస్సు. మరి శాంతి ఎలాగ వస్తుంది అంటే ఈశ్వరుడిపట్ల భక్తికలిగి ఉంటే శాంతి వస్తుంది. ఈశ్వరుడిపట్ల భక్తి లేకుండా, ఈశ్వరుడి పట్ల ప్రేమ లేకుండా, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అనేటువంటి సజీవమైన విశ్వాసం లేకుండా మీకు శాంతి కలుగదు. ఈశ్వరుని పాదాలను ఆశ్రయిస్తేనే మీకు శాంతి కలుగుతుంది. రావణాసురుడికి నేను బలవంతుడను అనే గర్వం ఉంది. రాముడు అంటే ఒక మనిషే కదా అనేవాడు. రావణాసురుడు ఒకసారి రథం మీద ప్రయాణం చేస్తూ ఉంటే ఒక కొండ అడ్డు వచ్చింది. వాడికి విపరీతమైన గర్వం కదా! ఏమిటి నా రథానికి కొండ అడ్డు వచ్చింది అని ఆ కొండను ఎత్తి బయటపడేయటానికి ఆ కొండ కింద చేతులు పెట్టాడు. అది ఈశ్వరుడు ఉండే కొండ కైలాసం. కొండ అటూ ఇటూ కదలటం దివ్యదృష్టితో ఈశ్వరుడు చూసాడు. ఈశ్వరుడు ఏమి చేసాడు అంటే ఆయన బొటనవేలితో కొండని నొక్కాడు.

వీడిచేతులు కింద ఉన్నాయి కదా ఇంక చేతులు బయటకు రాలేదు. అప్పుడు శివుడిని ప్రార్థించి, ప్రార్థించి చేతులను బయటకు లాక్కొన్నాడు. అది పరమాత్మకు ఉన్న శక్తి. ఈశ్వరుడి దగ్గర ఉన్న శక్తితో పోలిస్తే మన శక్తి ఏపాటిది? రాముడు మిమ్మల్ని చంపాలనుకొన్నాడు అనుకోండి. ఆయన మీతో పెద్ద యుద్ధం చేయనక్కరలేదు. ఆయన చెయ్యి మీమీద వేస్తే ఒక కొండను మీద పెట్టినట్లు మీరు అణిగిపోతారు. ఆయన మహాశక్తి మంతుడు. అసలు భక్తి యొక్క రుచి మీరు చూడలేదు. భక్తి అనేది చాలా రుచిగా ఉంటుంది. జ్ఞానానికి, యోగానికి, ధ్యానానికి భక్తి పునాది. ఈశ్వరుని పాదాలయందు మీకు భక్తి లేకపోతే మీ మనస్సు శాంతించదు, మీ మనస్సు కుదురుపడదు.

తిరుపతి నుండి కడప వెళుతూ ఉంటే అక్కడ ఏకశిలానగరం ఉంది. అక్కడ ఉన్న రామాలయంలోనికి వెళ్ళాము. అక్కడ విగ్రహాలు చాలా పురాతనమైనవి. మనం గుడికి వెళ్ళినప్పుడు దేవుడి ముఖం మీద ముఖం పెట్టి చూడకూడదు. ఒక ప్రక్కకు నిలబడి చూడాలి, అది సాంప్రదాయం. ఈ విగ్రహాలు పురాతనమైనవి, ఏనాడు చేసినవో అని అనుకొంటూ ఆ విగ్రహాలను చూస్తున్నాను. అప్పుడు రాముడు నాకు ఏమని స్ఫురించాడు అంటే నువ్వు చూసేది ఇదేనా, రాముడిని కాదు నువ్వు చూడవలసింది, రామబ్రహ్మాంని చూడు. రాముడి విగ్రహం ఎప్పుడు చేసారు అని నువ్వు అనుకొంటున్నావు. ఎప్పుడు చెయ్యటంకాదు. నువ్వు రాముడి రూపాన్ని చూడటంకాదు, నువ్వు చూసేది బ్రహ్మమే, బ్రహ్మమే రాముడి రూపంలో ఉంది. అలా చూడు. అంటే చూసే విధానం చెప్పాడు.

భగవంతుని పాదాలయందు భక్తి కలిగినవాడికి ఉత్తమసుఖం కలుగుతుంది. అది ఇండిపెండెంట్‌గా ఉంటుంది. ఉత్తమసుఖానికి ముగింపు ఉండదు. జీవకోటి అనుభవించే భోగాలకు ముగింపు ఉంటుందికాని ఉత్తమసుఖానికి ముగింపు అంటూ ఉండదు. మీ శరీరం చనిపోయినా ఆ సుఖం మాత్రం కంటిన్యూ అయిపోతుంది. రజోగుణం నుండి బయటకు రండి. మీ పనులు మీరు చక్కబెట్టుకోండి. ప్రపంచంతో అతిగా ఉండవద్దు. అక్కరలేని గొడవలలో కలుగజేసుకోవద్దు. ప్రపంచానికి మనం దగ్గర అయ్యేకొలది భగవంతునికి దూరమైపోతాము. అందుచేత మీకు ఎంతవరకు అవసరమో అంతవరకే ఈ ప్రపంచాన్ని ఉపయోగించుకోండి. అతిగా ఉంటే కొన్ని ఇబ్బందులు వస్తాయి. మీరు రజోగుణంలో కనుక ఉంటే భవిష్యత్‌లో మీకు అశాంతిని, అసుఖాన్ని తీసుకొనివచ్చే పనులు ఎక్కువ చేస్తారు. అందుచేత రజోగుణంలో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేయండి. రజోగుణం అంటే ఈ ప్రాపంచిక గొడవలు, ప్రకృతి గొడవలు. ఈ ప్రపంచంతో తగుమాత్రంగా ఉండండి అంటే ప్రపంచం విడిచిపెట్టి మిమ్మల్ని పారిపోమనికాదు, మీ శరీర

యాత్ర నడవటానికి ఈ ప్రపంచం ఎంతవరకు అవసరమో అంతవరకు దానిని ఉపయోగించుకోండి, దానితో అతిగా ఉండవద్దు.

రాగద్వేషరహితుడు, దోషరహితుడు అంటే ఈ ప్రకృతికి సంబంధించిన దోషాలు ఏమీ లేనివాడు, ప్రశాంతమైన మనస్సుకలవాడు బ్రాహ్మీస్థితిని పొందుతాడు. జ్ఞానం రావాలంటే మనం ప్రకృతిగుణాలను దాటాలి. ప్రకృతిగుణాలు అంటే తమోగుణం, రజోగుణం, సత్వగుణం. ఈ ప్రకృతిగుణాలను దాటలేకపోతే మీరు బ్రహ్మంతోటి ఏకీభావం పొందలేరు. ప్రకృతిని దాటకుండా ఎవడూ యోగి అవ్వలేడు. మీరు ఇంటి దగ్గర ప్రశాంతంగా కూర్చుని మీ మనస్సు ఎటు ప్రయాణం చేస్తోందో చూసుకోండి, ఏ విషయాలమీద వాలుతోందో చూసుకోండి. మనం పూర్వజన్మలో దేనినైతే ఎక్కువ ప్రాక్టీసు చేసామో ఈ జన్మలో ఆ వాసన మీద మీ మనస్సు ఎక్కువగా వాలుతూ ఉంటుంది, దీనినిబట్టి పూర్వజన్మలు ఉన్నాయి అని మీకు తెలుస్తుంది. మనస్సుకు స్థిరత్వం తక్కువ. నువ్వు మనస్సు యొక్క పరిధిలో ఉన్నంతకాలం నీకు ఎంత డబ్బు ఉన్నా, చదువు ఉన్నా, కీర్తి ఉన్నా మనస్సు తాలుక డిస్ట్రబెన్స్ నిన్ను వెంటాడుతూనే ఉంటుంది, అందులోనుండి బయటకు రాలేవు. మనస్సు యొక్క వలయంలో ఉండి నువ్వు స్థిరత్వం పొందలేవు. మనస్సు అనే గెడపను దాటాలి. మనస్సు ఇంద్రియాల ద్వారా బయటకు వచ్చేస్తూ ఉంటుంది. మనస్సుకు చపలత్వం ఎక్కువ, దానిని అలా వదలవద్దు. అలా వదిలేస్తే నువ్వు నరకానికి పోతావు. నిన్ను బాగుచేసేది నీ మనస్సే. నువ్వు పాడైపోవటానికి కూడా నీ మనస్సే కారణం. అందుచేత నీ మనస్సును బాగుచేసుకొని నువ్వు అభివృద్ధిలోనికి రా. ఇప్పుడు మీ మనస్సు కనుక చీకటిలోకాలకు వెళ్ళే డైరెక్షన్‌లో ఉంటే మీరు కంగారుపడవద్దు. మీకు సబ్జెక్టు అర్థమవుతోంది కాబట్టి చీకటి లోకాలకు వెళుతున్న మనస్సును వెలుగున్నలోకాల వైపుకు మళ్ళించండి. ఇప్పటికైనా మీరు బాగుపడటానికి టైము ఉంది. అస్థిరంగా ఉన్న మనస్సుకు స్థిరత్వం తీసుకొనిరండి. మనస్సు స్థిరంగా ఉంటే అది మీకు ఉపకారం చేస్తుంది. అస్థిరంగా ఉంటే మీ మనస్సే మీకు అపకారం చేస్తుంది. మీరు రోజూ ఒక గంట ఏకాంతంగా కూర్చొని మీ మనస్సు ఏ విషయాలమీద తరచు వాలుతోందో చూసుకొని, ఆ విషయాలమీద వాలటం వలన వచ్చే నష్టం, దానివలన వచ్చే శిక్ష ఎలా ఉంటుందో దానికి తెలియజేసి, ఆ విషయాల నుండి మీ మనస్సును ఉపసంహరించి నీ హృదయంలో ఉన్న చైతన్యం దగ్గర, పరమాత్మ పాదాల దగ్గర మనస్సును నిలబడేటట్లు చేస్తే నీ మనస్సుకు ఏకాగ్రత కలిగి అది నెమ్మదిగా నశిస్తుంది.

డోంట్ ఎంబ్రాస్ ఫాల్స్ హేబిట్స్, డోంట్ ఎంబ్రాస్ ఫాల్స్ వాల్యూస్ అన్నాడు బుద్ధుడు. మిమ్మల్ని పాడుచేసే గుణాలను కౌగిలించుకోవద్దు. చెడ్డ విలువలను అవే మంచివి అనుకొని

వాటిని కౌగిలించుకోవద్దు. ఇతరులచేత గొప్పలు అనిపించుకోవటం, ఉపయోగంలేని పనులు చేయటం, అక్కరలేని గొడవలలోనికి వెళ్ళటం ఇటువంటి విషయాలను కౌగిలించుకోవద్దు. మిమ్మల్ని పతనం చేసే అలవాట్లను కౌగిలించుకోవద్దు. చెడుఅలవాట్లను, చెడ్డ విలువలను, కృత్రిమగౌరవాలను మీరు కౌగిలించుకోవటం వలన వాటిచేత మీరు ఆకర్షింపబడుతున్నారు. డోంట్ ఎంబ్రాస్ దెమ్. వాటిని కౌగిలించుకోవద్దు. బుద్ధుడు ఎంత అద్భుతంగా చెపుతున్నాడో చూడండి. మీకు ఇంతకంటే చెప్పే టీచరు ఎవడుఉన్నాడు. మిమ్మల్ని పాడుచేసే గుణాలను కౌగిలించుకొంటారు ఏమిటి? ఏ విలువలు అయితే మిమ్మల్ని అభివృద్ధిలోనికి తీసుకొని వస్తాయో వాటిని వదిలేసి, మిమ్మల్ని పతనం చేసేవాటిని కౌగిలించుకొంటారు ఏమిటి? డోంట్ ఎంబ్రాస్ రాంగ్ తింకింగ్, యు మస్ట్ ప్రాక్టీస్ రైట్ తింకింగ్. మన ఆలోచనలో దోషం ఉండకూడదు. మన ఆలోచన సరిగ్గా ఉండాలి. రైట్ తింకింగ్‌ను ప్రాక్టీసు చేయాలి. భవిష్యత్‌లో అశాంతిని తీసుకొని వచ్చే పనులు మీరే చేసుకొని శాంతి రావటంలేదు అంటే దానికి ఎవరు సమాధానం చెపుతారు. అసత్యాన్ని సత్యం అనుకొని కౌగిలించుకోవద్దు. అనిజాన్ని నిజం అనుకొని కౌగిలించుకోవద్దు. విలువలేని విషయాలలో విలువ ఉందని అనుకొని వాటిని కౌగిలించుకోవద్దు. అక్కరలేని గొడవలను, ఉపయోగం లేని మాటలను హృదయంలోనికి తీసుకోవద్దు. ప్రపంచంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి, దేనినీ హృదయంలోనికి తీసుకోవద్దు.

భగవంతుడే మనకు స్నేహితుడు, భగవంతుడే మనకు భర్త, భగవంతుడే మనకు బంధువు. భగవంతుడికంటే మన క్షేమం కోరేవాడు, భగవంతుడికంటే మనలను ప్రేమించేవాడు ఈ సృష్టిలో ఎవడూ లేడు. అట్టి భగవంతుడియందు నీ మనస్సును ఐక్యం చేయటానికి ఆయన రూపాన్ని ధ్యానం చెయ్యి, ఆయన నామాన్ని స్మరించు. అక్కరలేని గొడవలకు నీ హృదయంలో చోటు ఇవ్వకుండా కొంచెం భగవంతుడికి అక్కడ చోటు యివ్వు. అప్పడు ఆయనే మీ హృదయాన్ని బాగుచేసి మీకు ఇస్తాడు. మీరు ఏపని చేసినా యజ్ఞభావనతో అంటే త్యాగభావనతో చేయమని భగవంతుడు చెపుతున్నాడు. మీరు ఇతరులకు ఎవరికీ చెడుతలపెట్టవద్దు. మీకు శక్తి ఉంటే మంచి చేయండి లేకపోతే ఊరక ఉండండి. ఈశ్వరుడిపట్ల విశ్వాసం పెంచుకోండి. మీ తెలివితేటలు, మీరు చేసే సాధనలు ఇవి అన్నీ రెండవపక్షం. అన్నింటికంటే ముఖ్యమైనది భగవంతుని అనుగ్రహం. భగవంతుని అనుగ్రహం కనుక ఉంటే మీకు అన్నీ సమకూరతాయి, దేనికోసం మీరు ఎదురుచూడనక్కర లేదు. నీకు ఏది కావాలో నీకంటే భగవంతుడికి ఎక్కువ తెలుసు. భగవంతుడి అనుగ్రహం కనుక నీకు ఉంటే నీకు జీవితంలో ఏమి కావాలో నువ్వు ఆయనను ఏమీ అడగనక్కరలేదు, అన్నీ ఆయనే సమకూరుస్తాడు.

మీరు ఏమి సాధనలు చేసారు, హిమాలయ పర్వతాలకు వెళ్ళారా అని ఎవరైనా నన్ను అడుగుతూ ఉంటారు. దత్తుడు సాధన ఏమి చేస్తాడు. నేను భగవంతుడికి దత్తుడు లాంటివాడిని. ఆయన నన్ను పెంచుకొన్నాడు. కష్టపడి సంపాదించుకొన్నవారు వేరు, దత్తత ఆస్తి కలిసినవారికి పెద్ద కష్టం ఏమీ ఉండదు. మేము ఏమీ సాధనలు చేయలేదు, ఆయన దత్తత చేసుకొన్నాడు అక్కడతోటి సరిపోయింది. మీరు విశ్వాసహీనులు అవ్వవద్దు, మీ నిదానంలో మీరు ఉండండి. భగవంతుడు లేడని ఎవరైనా చెపితే వాళ్ళ చంక ఎక్కికూర్చోవద్దు. మీరు సొంతంగా ఆలోచించుకోండి. మీకు భగవంతుడు కాళ్ళు, చేతులు ఎలా ఇచ్చాడో ఆలోచించుకోవటానికి బుద్ధి కూడా ఇచ్చాడు. అందుచేత మీ సొంతబుద్ధి ఉండగా పరాయిబుద్ధి మీద ఆధారపడవద్దు. మీ సొంతబుద్ధి ఎంత దూరం తీసుకొనివెళుతుందో అంత దూరం వెళ్ళండి, తరువాత విశ్వాసం మీద ఆధారపడి ఉండండి. అందుచేత భగవంతుడి యందు విశ్వాసం పెంచుకోండి, ఆయనే మిమ్మల్ని అనుగ్రహిస్తాడు. నన్ను విశ్వసించు. నా పట్ల నీకు ఉన్న విశ్వాసం నిజమైతే నువ్వు బాగుపడే బుద్ధిని, నీకు ఆత్మజ్ఞానం ప్రసాదించే బుద్ధిని నేను నీకు ఇస్తాను అని పరమాత్మ వాగ్దానం చేస్తున్నాడు. ఇది ఒక సామాన్య మానవుడు చేసిన ప్రామిస్‌కాదు, ఈ సృష్టికి ఆధారంగా ఉన్న పరబ్రహ్మం కృష్ణరూపంలో వచ్చి మనకు వాగ్దానం చేస్తున్నాడు. అందుచేత ఈశ్వరుడిపట్ల భక్తిని పెంచుకోండి, ఈశ్వరుడిపట్ల విశ్వాసం పెంచుకోండి.

మనస్సు కోతి వంటిది. కోతులు చెట్ల మీద ఒక రొబ్బమీద నుండి ఇంకో రొబ్బమీదకు ఉరుకుతూ ఉంటాయి. అలాగే మన మనస్సు ఒక తలంపు మీద నుండి ఇంకో తలంపు మీదకు ఉరుకుతూ ఉంటుంది. రాబోయే జన్మలకు కారణాలు అన్నీ మనస్సులో ఉంటాయి. ఈ శరీరం నాది అని చెప్పేది కూడా మనస్సే. మనస్సు శరీరం లేకుండా ఉండలేదు కాబట్టి పునర్జన్మ వస్తుంది. శరీరం లేకుండా మనస్సులో ఉన్న కోరికలు ఎలా నెరవేరతాయి. మనస్సు ఎలా కంట్రోలు అవుతుంది అంటే 1. సజ్జనసాంగత్యం, 2. మీకు ఏ దేవుడు అయితే ఇష్టమో ఆయన రూపాన్ని ధ్యానం చెయ్యటం, ఆయన నామాన్ని స్మరించుకోవటం. మీరు ఎవరిని చూసినా ఆయనలో మీ ఇష్టదైవాన్నే చూడాలి. మనస్సు బయటకు వస్తే అశాంతి వస్తుంది. మనస్సు ఏ కారణం వలన బయటకు వస్తోందో చూసుకోండి. ఆ కారణాన్ని తగ్గించుకొంటే ఇంక అశాంతి తగ్గిపోతుంది. ఒక మనిషి ఇంకో మనిషిని హింసపెట్టనక్కరలేదు. వాడి మనస్సే వాడికి శిక్ష. శరీరబాధ పడవచ్చుకాని, మనస్సులో ఉన్న అశాంతిని భరించటం చాలా కష్టం. డైరెక్టుగా ఆత్మను చింతించటం కష్టం అవుతుంది. అందుచేత మీకు ఏ దేవుడు అయితే ఇష్టమో ఆయన రూపాన్ని నిరంతరం చింతించటం వలన మనస్సుకు ఏకాగ్రత కలిగి, అది నెమ్మదిగా పల్చబడి నశిస్తుంది. ధనవంతులకంటే, పండితులకంటే మనోనిగ్రహం కలవారు ఉత్తమోత్తములు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| జనవరి | 6 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం - భగవాన్ జయంతి |
| ఫిబ్రవరి | 17 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం - శివరాత్రి |

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**



**వైజాగ్‌లో నిర్వహించిన దీపోత్సవం కార్యక్రమంలో సద్గురు శ్రీ నాన్నగారు**



# భక్తిని ఆశ్రయించినవారికి - తాపత్రయాలు తారసపడవు

వ్యధమాన హృదయాన్ని కొరికేస్తూ ఉంటుంది. దైన్యమనే కత్తి మనశిరస్సుపై వేళ్ళాడుతూ ఉన్నట్లు తాపత్రయపడతాము. 'నేను' అన్నది పోయి 'నువ్వు' అన్న దానికి ప్రాధాన్యత వచ్చినప్పుడు నిజమైన భక్తి మొదలౌతుంది. వివేకంతో కూడిన భక్తితో భగవంతుణ్ణి ఆరాధించాలి. త్యాగాన్ని జీవిత ఆదర్శంగా తీసుకోవాలి. 'శ్రద్ధ'లోంచే భక్తి పుట్టింది. సద్గురువును అన్వేషించాలి. వారి పరిపూర్ణ ప్రేమ వారి దివ్య పాదాల వద్దనే ఉంటుంది. వారి ప్రేమచేతనే మనం బాగుపడాలి. భయంచేతకాదు. మనలను మనం ఎంత పరిశుద్ధం చేసుకొంటే గురువుకు అంత దగ్గర అవుతాము. భక్తి మనలోనే ఉంది కాని కామం, ధనాశ దాన్ని కప్పుతుంది. "భక్తి తల్లి - జ్ఞానం బిడ్డ" అన్నారు భగవాన్. ప్రారంభంలో అద్వైతం పాటించటం చాలా కష్టం. ద్వైత దృక్పథంతో సద్గురువును ఉపాసిస్తే క్రమంగా అద్వైత సాక్షాత్కారానికి తీసుకొనిపోతుంది. గోపికలకు కృష్ణుడు జగన్నాధుడు, సర్వశక్తివంతుడు, పరంధాముడు అని వినుటలో ఆశక్తిలేదు. ఆయన అఖండ ప్రేమ మూర్తి అని మాత్రమే వారి భావన. వారికి ధనమక్కరలేదు, పాండిత్యమక్కరలేదు, స్వర్గం అక్కరలేదు నీ ఎడల నిష్కామభక్తి కోరుతున్నాము. భక్తి కొరకే భక్తి. వారు ఎవరి మొఖము చూచినా శ్రీకృష్ణుడనే చూచారు. తనమొఖాన్ని చూచుకున్నా కృష్ణుడే. ఈ భక్తికే పరమాత్మ పొంగిపోయి అంటారు "బృందావనంలో పాలు పితికే గోపికలు ఏ విజ్ఞానాన్ని ఒడిసి పట్టుకొన్నారు వారు నన్ను బంధించింది ఈ ప్రేమబంధంలోనే అంటూ నా భక్తులను పూజ్యభావంతో ఎవరు సేవిస్తారో వారు భక్తులలోకెల్ల అగ్రశ్రేణికి చెందినవారు" అన్నారు. ప్రేమలో హద్దులు లేని ఆనందం ఉంది. భక్తిని పూజ గదిలో అదరా బదరా ముగించకూడదు. నిజభక్తిలో విసుగు రాదు. భక్తి అంటే సమర్పణం. కైంకర్యం కర్పూరం వెలిగిస్తే ఏమీ మిగలదు. అంకితభావంలేని అభ్యాసం శక్తిని వృధా చేసుకోవటమే అలా ఉంటే మనం కేంద్రం వైపుకు ఎలా చొచ్చుకొనిపోగలము? శ్రీనాన్నగారు "నిజ భక్తి కుదిరితే రాగ, ద్వేషాలనే పులులు మిమ్ములను సమీపించవు" అన్నారు. "భక్తి రూపమగు ఉపాసన సర్వశ్రేష్టము. ఈ భక్తి వల్ల జ్ఞానమార్గము కన్న సత్యాన్ని సులభంగా పొందవచ్చు" అంటారు పెద్దలు. భగవంతుని ఎడల గాఢమైన ప్రేమే భక్తి ఆ గొప్ప గుణం మనస్సును నిర్మలంచేసి, పవిత్రం చేస్తుంది. దేశకాల విచక్షణ లేక నిరంతరం ఆ గురుమూర్తియందు భక్తి కుదిరితే గురువు మనలను ప్రేమిస్తున్నాడని గుర్తు. అప్పుడు దేనియందు వైరభావం రాదు. అంతా చిన్మయంగా తోస్తుంది. అంతా గురుదేవులే నడిపిస్తున్నారు అనే స్ఫురణ ఘాఢంగా, గూఢంగా హృదయానికి తెలుస్తుంది. అస్తమిస్తున్న భర్త గూర్చి ఉదాత్త ప్రేమ భరిత హృదయంతో ధర్మపత్ని ఎలా చింతిస్తుందో అటువంటి ప్రేమోద్వేగంతో మనం మన గురుదేవుల గురించి చింతించి మీ పాద పద్మాలు ఒక్కటే నాకు దిక్కు అని విలపించాలి అప్పుడే సత్యసాక్షాత్కారమౌతుంది.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్థవరం, సెల్ : 9491968966